
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాప్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
మంగళవారం 26 ఆగష్టు 2025

# కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున వికలాంగుల నిరసన

అనంతపురం, ఆగష్టు 25 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కలెక్టరేట్ ను వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం రోజున పెద్ద ఎత్తున వికలాంగులు ముట్టడించారు. ఈ ముట్టడి కార్యక్రమం విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు జానకి రామయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమములో వి హెచ్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్.ఓ.పెద్దన్న పాల్గొని మాట్లాడారు

గత 20.30 సంవత్సరాల కాలం నుండి వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలతో ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి పెన్షన్ పెంపు సాధించుకోవడం జరిగిందని నేడు కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో వికలాంగుల పెన్షన్లు తీసివేయడం సమంజసం కాదని అర్హత కలిగిన మేరకు వికలాంగుల పెన్షన్లు యధా విధిగ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనర్హత గల పింఛన్లను రీ వెరిఫికేషన్ చేసి అర్హత గల వికలాంగుల పింఛన్లను పునర్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వికలాంగుల పెన్షన్ తీసుకోవడం వల్ల వారి కుటుంబాలు వారిపై ఆధారపడి జీవించేవారు. చాలా సంతోషంగా ఉన్న సమయంలో కూటమి ప్రభుత్వం ఇలా రీ వెరిఫికేషన్ పేరుతో పెన్షన్ తొలగించడం చాలా దుర్మార్గమని తక్షణమే రీ వెరిఫికేషన్ నిలుపుదల చేసి యధా విధిగ పెన్షన్లు ఇవ్వాలని విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న కోరారు. ఈ ముట్టడి కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, జిల్లా అధ్యక్షుడు జానకి రామయ్య,విహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మసముద్రం తిప్పేస్వామి, విహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు రంగనాథ్, విహెచ్పిఎస్



మహిళ అధ్యక్షురాలు జయమ్మ, ఎంఆర్పిఎస్ మహిళ అధ్యక్షురాలు జగ్గుల స్వతంత్ర కుమారి, విహెచ్ ఫేస్ మహిళ నాయకురాలు పద్మ, ఈశ్వరమ్మ ,పార్వతి, నారాయణమ్మ, రమాదేవి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు డాక్టర్ సామ్రాట్ మధు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరి గోపాల్, యువసేన జిల్లా అధ్యక్షులు బాణాసి, శీను, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులకుంట రామాంజనే-యులు, ఉపాధ్యక్షులు మారెప్ప, వీహెచ్పీఎస్ నాయకులు నాగభూషణం, శ్రీరాములు, ఎల్లప్ప, సురప్ప, కూడేరు రాజు, కలగళ్ల, ముత్యాలు, పరమేష్,సుంకన్న ,మణికంఠ శ్రీనివాసులు, తదితర వికలాంగులు భారీ ఎత్తున పాల్గొన్నారు

# ధర్మవరం పట్టణంలో అటల్ బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలు



ధర్మవరం, ఆగష్టు 25 (అనంత ప్రభ)

ధర్మవరం పట్టణంలోని ఆర్డిటి మైదానంలో జరుగుతున్న అటల్ బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2లో ఐదవ రోజు, ఆదివారం నిర్వహించిన పోటీలు క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరిత అనుభూతిని కలిగించాయి. ఈ రోజు జరిగిన రెండు మ్యాచుల్లో నాలుగు జట్లు తమ ప్రతిభను ప్రదర్శించి క్రీడాభిమానులను అలరించాయి. మొదటి మ్యాచ్‌లో నాయక్ వారియర్స్ మరియు చత్రపతి శివాజీ-లెవెన్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌కు బీజేపీ నాయకులు కోళ్ల మొరం భాస్కర్ రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో నాయక్ వారియర్స్ జట్టు సమన్వయం, ధైర్యం, పట్టుదలతో మెరిసి 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. జట్టు ఆటగాళ్ల కృషి, జట్టు భావం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండవ మ్యాచ్‌లో కొత్తచెరువు గాంధీనగర్-లెవెన్స్ మరియు బసంపల్లి జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌కు బీజేపీ నాయకులు పోతుకుంట శ్రీనివాసులు టాస్ వేసి ప్రారంభించారు. ప్రారంభం నుంచి చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో బసంపల్లి జట్టు సాహసోపేతమైన ఆటతీరుతో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముఖ్యంగా చివరి ఓవర్లలో బసంపల్లి జట్టు ప్రదర్శన ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. ఈ రోజు జరిగిన రెండు మ్యాచుల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన పరుశురాం ఎం.17 (నాయక్ వారియర్స్) మరియు సోము (బసంపల్లి)లకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు దక్కాయి. తమ అసాధారణ ప్రతిభ, సాహసోపేత ఆటతీరుతో ఈ ఇద్దరు ఆటగాళ్లు మ్యాచ్‌ను తమ పక్షాన నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతున్న ఈ అటల్ బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలు క్రీడాభిమానుల్లో విశేష ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ప్రతి జట్టు విజయ లక్ష్యంతో పోరాడుతుండగా, యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడానికి ఈ టోర్నమెంట్ ఒక అద్భుత వేదికగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో కోచ్ రాజశేఖర్, కోచ్ పృద్వి, బిజెపి నాయకులు శ్యామ్ రావు, పోతుకుంట రాజు, సోమ్లా నాయక్, చిన్న లింగమయ్య, పోతుకుంట శ్రీనివాసులు, కోళ్లమూరం భాస్కర్ రెడ్డి, రమేష్, నిమ్మలకుంట శీను, పోతునాగుపల్లి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

పుట్టపర్తి , ఆగష్టు 25 (అనంత ప్రభ)

తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వచ్చే అర్జీదారుల సమస్యలను.. అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపుహాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ తో పాటు ఇంచార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఆర్డీఏ పిడి నరసయ్య హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ల్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ.... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన



విజ్ఞప్తులలో కొన్ని..

(1)హిందూపురం మండలం కోటిపి గ్రామానికి చెందిన జి. గంగప్ప తన ఇంటి ఆధారాలు లేవని తనకు వృద్ధ్యప్య పింఛన్ మంజూరుకు లకె చర్యలు తీసుకోవాలని కోరియున్నారు.

(2)కొత్తచెరువు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి తనకు వచ్చే వికలాంగ పింఛను నిలిపారని తిరిగి మంజూరు చేయాలని అభ్యర్తించారు.

(3)నల్లమడ మండలం రామాపురం గ్రామానికి చెందిన డి. గంగమ్మ తనకు వృధ్యాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు.

ఈ రోజు కార్యక్రమంలో పుట్టపర్తి-63 , పెనుకొండ- 83, ధర్మవరం-52 ,మరియు కదిరి- 42అర్జీలు, మొత్తం 240 అర్జీలను స్వీకరించడం జరిగిందని తెలిపారు

# వినాయక వేడుకలు ప్రశాంతంగా...కలిసి మెలసి సోదర భావంతో జరుపుకోవాలి

## తాడిపత్రి ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి

- గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు, వివిధ మత పెద్దలతో శాంతికమిటీ సమావేశం
- సోషల్ మీడియా లో వచ్చే వదంతులు నమ్మవద్దు, షేర్ చేయవద్దు.
- సమస్యలుంటే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలి

తాడిపత్రి, ఆగష్టు 25 (అనంత ప్రభ)

సోమవారం పెద్దవడగూరు పోలీసు స్టేషన్లో తాడిపత్రి ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి సి.ఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులలతో కలిసి శాంతికమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మత పెద్దలతో ఏఎస్పీ గారు మాట్లాడారు. ముఖ్యమైన వినాయక విగ్రహాల వద్ద తాత్కలిక సిసి కెమెరాలను అమర్చుకునే విధంగా చూడాలన్నారు. ఖచ్చితంగా రాత్రివేళల్లో విగ్రహాల వద్ద ఒకరు కాపాలా ఉండే విధంగా ఉత్సవ కమిటి సభ్యులు చూడాలన్నారు. సిసికెమెరాలతోనే నేర నివారణ సాధ్యమవుతుందన్నారు.

ట్రాఫిక్ కు అంతరాయం కలిగించకుండా అందరూ సహకరించాలన్నారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో పోలీస్ ల సూచనలు పాటించాలి. ఏదైనా సమస్య ఉంటే అనుమతులు



ఇవ్వమని చెప్పారు. పోలీసుల నిబంధలు పాటించాలన్నారు. అనుమతులు పొందాలంటే ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. పెద్దవడగూరు మతసామరస్యానికి స్ఫూర్తిగా నిలిచిందని కుల, మతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలన్నారు. పుకార్లు, వదంతులను ప్రచారం చేయకూడదన్నారు, నమ్మవద్దన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్ ల పై జిల్లా పోలీసులు నిఘా ఉంచారన్నారు.అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను పటిష్టం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీతో పాటు పెద్దవడగూరు సి.ఐ రామ సుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

# కూడేరు లో స్పందన కు..డుమ్మా కొట్టిన పలుశాఖ అధికారులు

- రెగ్యులర్ తహశీల్దారు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అర్జీ దారులేక వెలవల బోయిన గ్రీవెన్స్
- జిల్లా కలెక్టర్,గ్రీవెన్స్,కు వెళుతున్న అర్జీదారులు

కూడేరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయానికి ఒకటిన్నర సంవత్సరం పైగా రెగ్యులర్ తహశీల్దర్ లేకపోవడం ఇంతవరకు ప్రభుత్వం రెగ్యులర్ తహశీల్దారుని నియమించకపోవడంతో అదే అదునుగా కొంతమంది సోమవారం రోజున జరిగే గ్రీవెన్స్ కు పలు శాఖ అధికారులు స్పందన కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు రకాల సమస్యలపై వచ్చే అర్జీదారులు చేసేది ఏమీ లేక కూడేరు తహశీల్దారు కార్యాలయ పరిస్థితి అర్థం కాక అర్జీదారులు నేరుగా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన కార్యక్రమానికి వెళుతున్నారు. దాంతో కూడేరు తహశీల్దారు కార్యాలయం లో గ్రీవెన్స్ కు అర్జీదారులు లేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెల పోయింది. ప్రభుత్వ అధికారులు కొంతమంది ఉదయం 11 గంటల సమయం అవుతున్న స్పందనకు హాజరు కాకపోవడం, గమనార్హం, ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దార్ ఉదయ భాస్కర్, ఉదయం 9 గంటలకు స్పందన కార్యక్రమానికి గైర్హాజరైన పలు శాఖ అధికారులతో ఆయన చరవాణి ద్వారా సంభాషించి స్పందన కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది, అయితే స్పందనకు హాజరైన మండల అధికారులు మాత్రం.. చేసేదేమీ లేక చరవాణిలో (వారి వారి సెల్ ఫోన్లు) ద్వారా కాలక్షేపం చేశారు. ప్రభుత్వం ప్రజా



సమస్యల పరిష్కార వేదికగా జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు మండల కేంద్రాల్లో తప్పకుండా స్పందన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో మండల స్థాయి అధికారులు కొంతమంది సరైన సమయమునకు హాజరు కాగా మరి కొంతమంది అధికారులు స్పందనపు హాజరు కాకపోవడం గమనార్హం ,ఈ సందర్భంగా మండల ప్రజలు తహశీల్దార్ కార్యాలయము నకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు కూడేరు మండలానికి రెగ్యులర్ తాసిల్దార్ ను నియమించవలసిందిగా, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు,మండల ప్రజలు కోరుతున్నారు.మండలంలోని ప్రజలు కలెక్టరేట్లోని గ్రీవెన్స్ కు అధిక శాతం హాజరై వారి సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు

# అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల పైన జిల్లా సమీక్షా కమిటీ (డి.ఆర్.సి.) సమావేశం

అనంతపురము, ఆగష్టు 25 (అనంత ప్రభ)

స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని రెవిన్యూ భవన్ నందు నిర్వహించబడిన అనంతపు-రము జిల్లా సమీక్షా కమిటీ (డి.ఆర్.సి.) సమావేశం నందు ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ గారు పాల్గొన్నారు. సమావేశంలో అనంతపురము జిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల పైన సమగ్ర సమీక్ష నిర్వహించడం జరిగింది. గౌరవ చైర్ పర్సన్ గారు మాట్లడుతూ దివ్యాంగుల పెన్షన్ల ను రీ-వెరిఫికేషన్ పేరుతో అనేకమంది అర్హులను తొలగించడం ఎంతో బాధాకరమైన విషయం అని, అర్హులైన దివ్యాంగులు పెన్షన్ ఎంపికలో తమ పేర్లను తొలగించారని అనేక చోట్ల నిరసనలు తెలిపారని, అధిక శాతం వైకల్యం కలిగి అర్హులైన దివ్యాంగులు రీ వెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్ లు పొందడం కోసం ఎంతో ఇబ్బంది పడుతున్నారు అని, అలాంటి అర్హులైన దివ్యాంగులకు పించన్లును తొలగించకుండా, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పించన్లు



పునరుద్ధరించాలని తెలిపారు. అలాగే రైతన్నలకు పి.యం.కిసాన్ నిధులు విడుదల చేసినంత మందికి అన్నదాత-సుఖీభవ నిధులు జమ కావడం లేదని, టెక్నికల్ సమస్యల వలన పడకపోతే వాటిని సరిచేసి అలాంటి రైతులకు నిధులు జమయ్యేలాగా తగుచర్యలు తీసుకొనవలసినదిగా తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు, ఎమ్మెల్సీ శ్రీ శివరామి రెడ్డి గారు, పార్లమెంటు సభ్యులు %ు% రాష్ట్ర శాసన సభ సభ్యులు, జిల్లా కలెక్టరు గారు, యస్.పి గారు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్ష సాయి మణి జన్మదినము సందర్భంగా అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, ఆగష్టు 25(అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో యాడికి మండలం అనంత జనశక్తి న్యూస్ విలేకరి చింతా రంగస్వామి, భార్య రాధిక వారి కూతురు వర్ష సాయి మణి పుట్టినరోజు శుభ సందర్భముగా ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ నిర్వాహకుడు బత్తల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా చింతా రంగస్వామి మాట్లాడుతూ నా కూతురు పుట్టిన రోజును అగాపే ఆశ్రమంలో జరుపుకోవడము సంతోషంగా ఉందని, పెద్దవారి ఆశీస్సులు నా కూతురుకి ఎప్పుడూ ఉండాలని, ఈ విధంగా మా కుటుంబమంతా కలిసి వారికి భోజనాలు వడ్డించడం మాకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మరియు ఆశ్రమంలోని వారంతా వర్ష సాయి మణికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి మిత్ర బృందం శ్రీనివాసులు గౌడ్ , ఫరూక్, పెండేకల్లు నారాయణస్వామి, గుండా రామకృష్ణ, పోలా రామాంజనేయులు, రంగం శ్రీనివాసులు, సెల్ పాయింట్ జనా, సింహం రాము, కళ్యాణి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు

## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి..



పుట్టపర్తి , ఆగష్టు 25 (అనంత ప్రభ)
రానున్న వినాయక చవితి పండగను శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలని పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ సూచించారు .

జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపీఎస్ గారి ఆదేశాలతో..
సోమవారం సాయంత్రం పుట్టపర్తి లోని సాయి ఆరామంలో పుట్టపర్తి టౌన్ ,పుట్టపర్తి రూరల్ ,బుక్కపట్నం, మండలాలకు చెందిన శాంతియుత ( పీస్ కమిటీ) సభ్యులు, నిర్వాహకులతో పుట్టపర్తి డిఎస్పి విజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకల నియమ నిబంధనలను తెలియజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి గారు మాట్లాడుతూ అందరూ కలిసి మెలిసి సోదర భావంతో మతసామరస్యానికి ప్రతిగా ఈ వినాయక చవితి పండుగ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

## జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపీఎస్ గారి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు



పుట్టపర్తి , ఆగష్టు 25 (అనంత ప్రభ)
జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ లు చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు. హెల్మెట్ , సీట్ బెల్టు ధరించాలని, డ్రంకన్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు పలు జాగ్రత్తలు సూచనలు చేశారు.


## జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ని కలిసి సమస్యలను వివరించిన సమాచార హక్కు జిల్లా అధ్యక్షులు , ఉపాధ్యక్షుడు



తాడిపత్రి, ఆగష్టు 25 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా కలెక్టర్ ఆఫీస్ స్పందన కార్యక్రమంలో ఈరోజు సోమవారం ఉదయం సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు కోటేగంటి నబి రసూల్, డాక్టర్ రామలింగయ్య, వి హుస్సేన్ పీరా, జాయింట్ సెక్రెటరీ మనోజ్ కుమార్, కమిటీ సభ్యులందరూ జిల్లా కలెక్టర్ ని కలిసి జిల్లా కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అందరూ పాల్గొనడం జరిగింది

## సరికొత్త బేసిక్ ప్లాన్ తో (బిఎస్ఎన్ఎల్ ) ఫైబర్ టీవీ నెట్వర్క్

- బిఎస్ఎన్ఎల్ ట్రిపుల్ ప్లే బేసిక్ ప్రణాళిక
- కేబుల్ ఆపరేటర్లకు కేవలం 400 రూపా లకే
- 20 మెగా బిట్స్ ఫర్ సెకండ్ (ఎం.బి) స్పీడ్ అన్ లిమిటెడ్ ఇంటర్నెట్
- ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి జనరల్ మేనేజర్ మజీబ్



అనంతపురం, ఆగష్టు 25 (అనంత ప్రభ)
భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ ( బిఎస్ఎన్ఎల్) టెలికాం సర్కిల్లో అనంత జిల్లాలలోని వినియోగదారుల కోసం కేవలం 400 రూపాయల తక్కువ ధరకే మెరుగైన సేవలను అందించడానికి ట్రిపుల్ ప్లే (ఎఫ్ టిటిహెచ్ ) నూతన ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ ప్రారంభించింది. దాంతో ఈ ప్లాన్ లో 20 మెగా బిట్స్ ఫర్ సెకండ్ వేగంతో (స్పీడ్) ఆపరమిత ఇంటర్నెట్, అపరమిత వాయిస్ కాల్స్ మరియు 400 ఫ్రీ చానల్స్ తో పాటు దాదాపు అన్ని తెలుగు పే చానల్స్ లను (44 ఛానేలను) వీక్షించవచ్చుని ఈ ప్లాన్ లో 9 ఓటీటీలు కూడా ఉన్నాయి. లోకల్ కేబుల్ ఆపరేటర్లు బిఎస్ఎన్ఎల్ లో (టీ ఐ పి) గా నమోదు చేసుకుని ఇప్పటికే ఉన్న (ఏపీఎస్ ఎఫ్ ఎల్ )కస్టమర్లను బిఎస్ఎన్ఎల్ కి మార్చవచ్చు. మరియు కొత్త ఫైబర్ కనెక్షన్లను కూడా అందించవచ్చు. ఆసక్తిగల లోకల్ కేబుల్ ఆపరేటర్లు జిల్లాలోని తమకు సమీపంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ డివిజన్ కార్యాలయం లేదా అనంతపురంలో ఉన్న పిజిఎం కార్యాలయాన్ని సంప్రదించగలరని కేబుల్ ఆపరేటర్ల సౌకర్యార్థం నేటి నుండి పైన తెలిపిన డివిజనల్ కార్యాలయాలలో (టీ ఐ పి/ ఎల్ సి ఓ మేళా నిర్వహించడం జరుగుతోందని లోకల్ కేబుల్ ఆపరేటర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా అనంతపురం టెలికాం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ తెలియజేశారు

## జై భీమ్ రావు భారత పార్టీ నూతన కమిటీ ఎంపిక



ఉరవకొండ, ఆగష్టు 25 (అనంత ప్రభ)
జైభీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో ఉరవకొండ నియోజకవర్గానికి నూతన కమిటీ సోమవారం ఏర్పాటు చేశారు. జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్ప నాయక్ ఈ కమిటీని ఏర్పాటుచేశారు, ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్ప నాయక్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ అధినేత జడ శ్రావణ్ కుమార్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో జైభీమ్ రావ్ భారత్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు దగ్గరయ్యేలా నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కమిటీ నిబద్ధతతో పనిచేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.
నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని, డా. అంబేద్కర్ సిద్ధాంతాలతో జడ శ్రావణ్ కుమార్ చేస్తున్న పోరాటాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలోని సభ్యులు రాప్తాడు మండలం అధ్యక్షులు కురుబ బీసీ నారాయణ. ఖాదర్ భాషా. షేక్షావలి. రాజకుమార్. రాజేష్. భీమేష్. రమేష్. హిమేష్ నాయక్. రాజగోపాల్ నాయక్. తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో గణేష్ మండపాల పూజలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరు



ధర్మవరం, ఆగష్టు 25 (అనంత ప్రభ)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం, ఉదయం 9:00 గంటలకు ధర్మవరంలోని వివిధ గణేష్ మండపాల పూజా కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ విషయాన్ని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ప్రతి సంవత్సరం విశేషంగా జరిగే వినాయక ఉత్సవాల సందర్భంగా, పట్టణంలోని గణేష్ మండపాల్లో భక్తులు విశేషంగా పాల్గొంటారని, ఈ సందర్భంగా మంత్రి స్వయంగా హాజరై వినాయక స్వామి దర్శనం చేసుకోవడంతో పాటు, భక్తులతో కలసి పూజా కార్యక్రమాలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. మంత్రి పర్యటనలో పట్టణంలోని ముఖ్య గణేష్ మండపాలకు వెళ్లి, స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, ఆశీర్వచనం పొందడం వంటి కార్యక్రమాలు కూడా ఉంటాయని హరీష్ బాబు పేర్కొన్నారు. ధర్మవరంలో ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకొని తగిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

## రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా చెల్లించిన ఎయిర్టెల్




యాడికి, ఆగష్టు 25(అనంత ప్రభ)
ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు వారు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తుందని ఎయిర్టెల్ నిర్వాహకులు తెలిపారు. సోమవారం యాడికి మండల కేంద్రంలోని ఎయిర్టెల్ ఆదిరెడ్డి సేవ కేంద్రం నందు యాడికి మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బోయ రాముడు కుమారుడు బోయ వెంకటరాముడు ఏప్రిల్ నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులు ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్ వారికి తెలియజేయగా వారు మరణించిన వ్యక్తి మరియు నామిని వివరాలను సేకరించి వారి కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును యాడికి ఎంపీడీవో వీర్రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు గ్రామీణ ప్రాంతాలలో అత్యంత సేవలు అందిస్తున్నదని, ప్రమాదంలో మరణించిన బోయ వెంకట రాముడు కుటుంబానికి ప్రమాద బీమా రెండు లక్షల రూపాయలను ఎయిర్టెల్ సిబ్బంది అందజేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎయిర్టెల్ ఆదిరెడ్డి మాట్లాడుతూ భరోసా అకౌంట్ వంటి ప్రత్యేక ఖాతా ఉన్నవారికి ప్రమాద బీమా కవరేజ్ అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిర్టెల్ జెడ్ ఎస్ ఎం చత్రపతిరెడ్డి, టీఎం జగదీష్, జెడ్ ఎమ్ నవీన్ శెట్టి, జెడ్ టి యం సంపంగి శ్రీనివాసులు, సి జి ఓ భాష, ఆర్ బి ఎం విష్ణువర్ధన్, షణ్ముఖరెడ్డి, తాండ్ర విక్రమ్, పెయ్యల ప్రతాప్ రెడ్డి, మీసేవ జగదీష్, సెల్ పాయింట్ నిర్వాహకులు శ్రీకాంత్, గంగవరం రాజా, కోడూరు రాజారంగారెడ్డి, మారుతి, చింతా నరేష్, యాడికి మండల ఎయిర్టెల్ నిర్వాహకులు యుగంధర్ రెడ్డి, ఓబుళపతి, రంగనాథ్, బాలు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

## సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
## సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి. కేశవరెడ్డి



ఉరవకొండ, ఆగష్టు 25 (అనంత ప్రభ)
పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా నిత్యము మిలిటెంట్ పోరాటాలు చేస్తున్న శ్రమజీవుల భారతకమ్యూనిస్టు పార్టీ 28వ రాష్టమహాసభలు ఒంగోలు కేంద్రములో ఈ నెల20తారీఖునుండి 25వతేదీవరకు ఘనంగా జరుగుతున్నాయని ఈ మహా సభలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. కేశవరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆయన ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ దున్నేవానికి భూమిహక్కులు కల్పించాలని, పేదలకు సమానహక్కులు కల్పించాలని, శివాయజమ భూములు పేదలకు పంచాలని, మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. ఉద్యమాల పోరుబాటలో అనేకమంది అమరులయ్యారని వారు త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మహసభలలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రైతాంగ సంక్షేమం, కరువు, జిల్లాలో నీటి ప్రాజెక్టుల కు నిధులు, చెరువులకు నీరు, రైతుల పండించిన పంటలకు మద్దతుధర, పంటలభీమా, అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, పక్కాగృహలు తదితరు అనేక అంశాలను మహసభలదృష్టికీ తీసుకెళ్తామని తెలిపారు. అక్కడ తీర్మాణలలో పాలుపంచుకోని ఉద్యమ కార్యాచరణాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు శ్రమజీవులు, సీపీఐనాయకులు కార్యకర్తలు, వామపక్ష సానుభూతిపరులు, తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కార్యదర్శి జె. మల్లికార్జున పార్టీ జిల్లా సమితి సభ్యులు చెన్నరాయుడు. పెరుగు సంగప్ప. సుల్తాన్, మల్లారాయుడు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ అధికారిని నీలవేణి



కూడేరు, ఆగష్టు 25 (అనంత ప్రభ)
కూడేరు మండల కేంద్రంలోని ఫారెస్ట్ అధికారిని నీలవేణి సోమవారం రోజున పర్యావరణ పరిరక్షణే బాధ్యతగా మండల కేంద్రంలోని కూడేరు గ్రామంలో వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. సకాలంలో వర్షాలు సరిగా కురువకపోవడం వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు (ఒక్కొక్క ) మొక్కను తమ బాధ్యతగా మొక్కలు నాటాలని వాతావరణం లోని కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మరియు వాటి సంరక్షణ బాధ్యతను కూడా బాధ్యతగా తీసుకోవాలని ఆమె అన్నారు.

## చెడిపోయిన బోరును మరమ్మతులు చేయండి



ఉరవకొండ, ఆగష్టు 25 (అనంత ప్రభ)
ఉరవకొండ స్మశాన వాటిక లో ఉన్న బోరంగి చెడి పోయిన పట్టించుకునే నాధుడే కరవయ్యారు. హిందూ సంప్రదాయా ప్రకారంగా అంత్యక్రియలు తరువాత నీటితో శరీరాన్ని సుద్దీ చేసుకోవడం ఆచారం స్మశాన వాటిక లో ఉపయోగించడానికి నీరు లేక పట్టణ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చేయాలని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, తెలుగు దేశం పార్టీ నాయకులు బాలు, ఉమేంద్ర, స్థానిక ప్రజలు బోర్ సంబందించనా పంచాయితీ అధికారులను ఉరవకొండ పంచాయితీ కార్యదర్శి కోరడమైనది.

## సర్పంచుకు ఘన సన్మానం



ఉరవకొండ, ఆగష్టు 25 (అనంత ప్రభ)
జాతీయస్థాయిలో అవార్డు వచ్చిన సందర్భంగా వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా ను అనంతపురం పట్టణంలో కలెక్టర్ ఆఫీస్, రెవెన్యూ భవనం నందు కలెక్టర్ వినోద్ కుమార్ ఐఏఎస్ ,జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఐఏఎస్ ,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ ఐఏఎస్ , ఐసిడిఎస్ పిడి నాగమణి , సిడిపిఓ డాక్టర్ బి.ఎన్ శ్రీదేవి ,చేతులమీదుగా సర్పంచ్ మోనాలిసా ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ జడ్పిటిసి ఏసి పార్వతమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకుడు బెంజ్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ఉషాశ్రీచరణ్‌ను అడ్డుకున్న పోలీసులు



పుట్టపర్తి , ఆగష్టు 25 (అనంత ప్రభ)
పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీమంత్రి ఉషాశ్రీచరణ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వెళ్లిన ఉషాశ్రీచరణ్‌ను అడ్డుకున్నారు. ఉషాశ్రీచరణ్ వెంట వచ్చిన వికలాంగులను కూడా పోలీసులు అనుమతించలేదు. దీంతో పోలీసులు, మాజీ ఉషాశ్రీచరణ్ మధ్య వాగ్వాదం జరిగింది. కలెక్టరేట్ ఎదుట వికలాంగులు నిరసన తెలిపారు.

## ఎక్కడికి వెళ్లినా నోస్టాక్ బోర్డులే !

అనంతపురం , ఆగష్టు 25 (అనంత ప్రభ)
జిల్లా అంతటా యూరియా నోస్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. ఆర్ఎస్కేలు, సొసైటీలు, డీసీఎంఎస్‌లకు తగినంత సరఫరా చేసినట్లు 'మార్క్‌ఫెడ్' చెబుతున్నా ఎక్కడా బస్తా కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ హోల్‌సేల్, రీటైల్ డీలర్లకు అవసరమైనంత ఇచ్చామని వ్యవసాయశాఖ అంటున్నా... వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ ఏప్రిల్ నుంచి జిల్లాకు చేరిన 14,286 మెట్రిక్ టన్నులతో పాటు గత ఖరీఫ్, రబీ మిగులుగా ఉన్న 15,241 మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కడికి వెళ్లిందో తెలియడం లేదు. అయితే, ఇందులో సగానికి సగం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలతో పాటు అధికారులు కుమ్మక్కై తమకు యూరియా లభించకుండా చేశారని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, అరటి సాగు చేస్తున్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాకు చేరిన యూరియా నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు జిల్లాలతో పాటు సరిహద్దు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున తరలించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పరిస్థితి చేయిదాటాక రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం హడావుడి చేస్తుండటంతో రైతులు విస్తుపోతున్నారు.







# తలకాయ కూర వండడం రావడం లేదా? ఇలా అయితే సింపుల్



తలకాయ కూర మటన్ విభాగం కిందకే వస్తుంది. మేక, గొర్రెల తలలతోనే ఈ కూరను వండుతారు. అందుకే మటన్ తినడం వల్ల కలిగే లాభాలన్నీ ఈ కూర తిడనం వల్ల కలుగుతాయి. మటన్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మహిళలు అధికంగా తింటే మంచిది. వీరికి రక్తహీనత సమస్య అధికంగా ఉంటుంది. ఈ మటన్లో బి విటమిన్లు అధికంగా లభిస్తాయి.గర్భిణులు మటన్ తినడం వల్ల పుట్టబోయే బిడ్డకు చాలా లాభాలు కలుగుతాయి. మటన్లో ఉండే పొటాషియం రక్తపోటు, గుండెజబ్బులు, కిడ్నీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఇందులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకల గట్టిదనానికి సహకరిస్తాయి. తలకాయ కూర సులువుగా ఎలా వండాలో చూడండి.

%కావాల్సిన పదార్థాలు

తలకాయ మాంసం - అరకిలో
ఉల్లిపాయ - ఒకటి
అల్లం వెల్లుల్లి పేస్టు - రెండు స్పూన్లు
కారం - ఒక స్పూను
పసుపు - ఒక స్పూను
గరం మసాలా - ఒక స్పూను
కొత్తిమీర తరుగు - నాలుగు స్పూనులు
ధనియాల పొడి - ఒక స్పూను
ఉప్పు - రుచికి సరిపడా
కొబ్బరి తురుము - ఒక స్పూను
మిరియాల పొడి - అరస్పూను
(కొబ్బరి తురుము మీకు నచ్చితే వేసుకోవచ్చు. వేయకపోయినా రుచి బాగానే ఉంటుంది)

తయారీలో ఇలా


1. తలకాయ కూరను బాగా కడిగి పెట్టుకోవాలి.
2. ఉల్లిపాయలు నిలువుగా సన్నగా తురమాలి. స్టవ్ పై కుక్కర్ పెట్టి అందులో నూనె వేయాలి.
3. నూనె వేడెక్కాక ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి.
4. అల్లం వెల్లుల్లి పేస్టు కూడా వేయించాలి. పసుపు, కారం కూడా కలపాలి.
5. అందులో తలకాయ కూర వేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చేదాకా ఉడికించాలి.
6. స్టవ్ మీద మరో కళాయి పెట్టి కుక్కర్లోని కూరను ఇందులోకి మార్చాలి.
7. ఉప్పు కూడా వేసి కాసేపు ఉడికించాలి.
8. ముక్క 90 శాతం ఉడికిపోయాక మిరియాల పొడి, ధనియాల పొడి, గరం మసాలా, కొబ్బరి తురుము వేసి ఉడికించాలి. అప్పటికే కూర బాగా ఉడికి మంచి వాసన వస్తుంది.
9. స్టవ్ కట్టేశాక పైన కొత్తిమీర చల్లి సర్వ్ చేయాలి. నాన్ వెజ్ ప్రియులెందరికీ తలకాయ కూరంటే ప్రాణం. ప్రత్యేకంగా వండుకుని తింటారు. ఇలా వండుకుని తింటే చాలా టేస్టీగా ఉంటుంది.

# బేకింగ్ సోడాతో ఇలా చేస్తే ఫర్నీచర్‌పై మరకలు పోతాయి

ప్రతి ఇంట్లోనూ ఫర్నీచర్ ఉంటాయి. సోఫా, మ్యాట్రెసెస్, చైర్స్ ఇలా చాలా రకాలు ఉంటాయి. వీటిని క్లీన్ చేసేందుకు చాలా టిప్స్ పాటించాలి. దీని వల్ల సోఫాలు చక్కగా క్లీన్ అవుతాయి. మరి అలా ఎఫెక్టివ్‌గా ఎలా దులపాలో ఇప్పుడు చూద్దాం.

ముందుగా మ్యాట్రెసెస్, సోఫా ఇంట్లోని సోఫాని ముందుగా దుమ్ముపోయేలా పొడి గుడ్డతో దులపండి. ఇంట్లో వాక్యూమ్ క్లీనర్ ఉంటే దానిని కూడా వాడొచ్చు.

దుమ్ము దులిపేటప్పుడు కేవలం ఫర్నీచర్ ముందుగానే కాకుండా, మూలలు, వెనకాల మొత్తంగా పూర్తిగా దులపండి.కొన్నింటికి పాకెట్స్ ఉంటాయి. వాటిని కూడా చక్కగా క్లీన్ చేయండి.



ఇప్పుడు గోరువెచ్చని నీటిలో కొద్దిగా వెనిగర్ వేసి అందులో క్లాత్‌ని ముంచి దానిని స్క్వీజ్ చేసి చక్కగా ఫర్నీచర్‌ని క్లీన్ చేయండి. దీని వల్ల ఫర్నీచర్ చక్కగా క్లీన్ అవుతాయి.

ఇత్తడి వస్తువులు కూడా..

ఇంట్లో ఇత్తడి వస్తువులు కూడా ఉంటాయి. ఇవి కూడా త్వరగా మసకబారిపోతాయి. వీటిని కూడా చక్కగా క్లీన్ చేసుకోవచ్చు. ఇందుకోసం అరకప్పు డిష్ వాష్, ఓ టీస్పూన్ ఉప్పు, కొద్దిగా పిండిని కలిపి వీటిపై చల్లి తేలిగ్గా క్లీన్ చేయొచ్చు. దీంతో వస్తువులు చక్కగా తెల్లగా మెరుస్తాయి.

ఉడ్ ఫర్నీచర్..

ఇక ఉడ్ ఫర్నీచర్‌ని తుడిచేందుకు పొడి వస్త్రాన్ని వాడండి. వీటిని మరింతగా మెరిసేలా చేయాలంటే వ్యాక్స్, పాలిష్ కూడా చేయొచ్చు.

వీటిమూలల్లో కర్పూరం, నాప్తలీన్ బాల్స్ వేయడం వల్ల అవి తేమని గ్రహించి పురుగు పట్టకుండా చూ-స్తాయి. కాబట్టి, రెగ్యులర్‌గా వీటిని చక్కగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు.

మరకలు దూరమవ్వాలంటే..

అదే విధంగా, దుమ్ముని క్లీన్ చేయాలంటే డిష్ వాష్ తీసుకుని నీటిలో కలిపి అందులో సాఫ్ట్ క్లాత్‌ని ముంచి బయటికి తీసి పిండి తడి గుడ్డతో ఫర్నీచర్‌ని రుద్దాలి.

తర్వాత పొడిగుడ్డతో తుడిచి వీటిని చక్కగా తుడవండి.

ఇలా క్లీన్ అయిన ఫర్నీచర్‌ని పూర్తిగా ఆరబెట్టండి.

పాతపాలిష్‌ని తొలగించడం..

కొన్ని వస్తువులు పాత పాలిష్‌తో చూడ్డానికి అంత బాగుండవు. వీటిని క్లీన్ చేయాలంటే.. ముందుగా కొద్దిగా టీ బ్యాగ్స్ తీసుకుని వేడినీటిలో వేసి డికాషన్ చేయాలి. ఇది గోరువెచ్చగా అయ్యే వరకూ ఉంచి గుడ్డపై దీనిని పోస్తూ కొద్దికొద్దిగా తుడవాలి. టీ నుంచి వచ్చే టానిక్ యాసిడ్ వుడ్‌ని క్లీన్ చేస్తుంది.

# పైనాపిల్ హల్వా, ఇలా చిటికెలో చేసేయచ్చు



పైనాపిల్ పేస్ట్రీలు, కేకులు అంటే ఎంతో మందికి ఇష్టం. వాటి ఫ్లేవర్ మనసును లాగేస్తుంది. ఇంట్లోనే చాలా తక్కువ సమయంలో సులువుగా పైనాపిల్ హల్వాను చేసుకోవడం ఇక్కడ చెప్పాం. ఇది రుచితో పాటూ ఎంతో ఆరోగ్యాన్ని అందిస్తుంది. పిల్లలకు చాలా నచ్చేలా ఉంటుంది దీని టేస్ట్. ఎలా చేయాలో చదవండి మరి.

కావాల్సిన పదార్థాలు

పైనాపిల్ ముక్కలు - రెండు కప్పులు
పంచదార - 200 గ్రాములు
కోవా - అర కప్పు
నెయ్యి - రెండు స్పూనులు
యాలకుల పొడి - ఒక టీస్పూను
జీడిపప్పులు - నాలుగు
కిస్‌మిస్‌లు - ఎనిమిది

తయారీ ఇలా

1. పైనాపిల్ పండ్లను చిన్న ముక్కలుగా కోసుకోవాలి.
2. ముక్కలు పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. నీళ్లు ఉండకూడదు.
3. స్టవ్ పై కళాయి పెట్టి నెయ్యి వేయాలి. అందులో పైనాపిల్ ముక్కలను వేసి వేయించాలి.
4. ముక్కలు కాస్త వేగి మెత్తగా అవుతాయి. ఆ సమయంలో పంచదార, కోవా ముద్ద కూడా వేసి బాగా కలపాలి.
5. యాలకుల పొడి, జీడిపప్పులు తురుములు కూడా వేసి బాగా కలపాలి.
6. అంతా దగ్గరగా ముద్దలా అయ్యేదాకా కలియబెట్టాలి. స్టవ్ చిన్న మంట మీద ఉండేలా చూసుకోవాలి. లేకుంటే మాడిపోయే ప్రమాదం ఉంది. చివరగా కిస్‌మిస్‌లు చల్లి స్టవ్ కట్టేయాలి. అంతే టేస్టీ పైనాపిల్ హల్వా రెడీ అయినట్టే. మీరు వండుతున్నప్పుడే మంచి సువాసన వస్తుంది హల్వా.
7. ఒక ప్లేటులో పైనాపిల్ హల్వాను వేసి ముక్కలుగా కోసుకోవాలి.

తింటే ఎన్ని ప్రయోజనాలో...

పైనాపిల్ పండు కొయ్యడం కష్టమని చాలా మంది కొనడానికే ఇష్టపడరు. కానీ దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ పండు ఒక్కసారి మూడు ముక్కల దాకా తినగలరు. ఆ తరువాత కొంచెం నాలుక పూసినట్టు అవుతుంది. అదే ఇలా హల్వా చేసుకుంటే ఎంతైనా తినేయగలరు. ఈ పండులో 85 శాతం నీరే. చక్కెర 13 శాతమే ఉంటుంది. వీటిలో %ూ, దీ, జ% విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీని తినడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు కూడా కరుగుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పండుకు కాస్త తేనె రాసుకుని తింటే శక్తి పెరుగుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి అనాస చాలా మేలు చేస్తుంది. ఈ పండు రసం గొంతు నొప్పిని తగ్గిస్తుంది. దీనిలో ఉండే పోషకాలు చర్మాన్ని మెరిపిస్తాయి. కంటి చూపును మెరుగుపరచడంలో కూడా ఇవి ముందుంటాయి.

# సమ్మర్‌లో మీ ఇల్లు ఇలా క్లీన్ చేస్తే అలర్జీలు దూరం..

ఇల్లు క్లీన్ చేయాలని అనుకుంటారు. కానీ, అనుకున్న విధంగా చాలా మంది క్లీన్ చేయలేరు. కిటికీలు, తలుపులు ఇలాంటివాటిని వదిలేస్తారు. అక్కడ దుమ్ము లేదని వదిలేస్తారు. కానీ, ఇది వదిలేసేంత ఈజీ కాదు. అక్కడ దుమ్ము పేరుకుపోయి ఇంటిని మురికిగా మారుస్తాయి. ఇంట్లో దుమ్ము, ధూళి పేరుకుపోవడం వల్ల ధూళి పురుగులు ఆ ప్రాంతంలో స్థిరపడతాయి. ఇవన్నీ కూడా దుప్పట్లు, దిండ్లు, సోఫా, ఇలా వాడే వస-్తువుల్లోకి చేరతాయి. దీంతో అలర్జీలు వస్తాయి. కంటికి కూడా కనిపించని ఇలాంటి చిన్న పురుగులు ఉబ్బసం, అలర్జీలకు కారణమవుతాయి.

ఎండాకాలంలో ఎక్కువగా..

మిగతా రోజులతో పోల్చితే ఎండాకాలంలో ఎక్కువగా దుమ్ము ఉంటుంది. ఈ సమయంలో ఇంట్లో దుమ్ము పేరుకుపోతుంది. కాబట్టి, ఈ సమయంలో రెగ్యులర్‌గా క్లీన్ చేయడం మంచిది.

ఇలా కాకుండా ఉండేందుకు..

మీరు కిటికీలు, తలుపులని రెగ్యులర్‌గా క్లీన్ చేయండి. కర్టెన్స్ కూడా క్లీన్ చేయడం మంచిది.

చాలా మంది కార్పెట్స్ వాడతారు. దీనిపై చాలా వరకూ దుమ్ము ఉంటుంది. ఇవి అటు నుంచి బెడ్స్ దాకా చేరతాయి. కాబట్టి, వీటిని కూడా మీరు రెగ్యులర్‌గా క్లీన్ చేయాలి.

పెంపుడు జంతువులు ఉంటే..


ఇంట్లో పెంపుడు జంతువులు పిల్లులు, కుక్కల, ఇలా కొన్ని జంతువులు ఉంటే వాటి బొచ్చులో చాలా రకాల సూక్ష్మ క్రిములు ఉంటాయని గుర్తుపెట్టుకోండి. అందుకోసం వాటిని ఎప్పటికప్పుడు స్నానం చేయించడం, వాటి బొచ్చుని కట్ చేయడం చేస్తుండాలి.

ఇన్ని చేసినా కొన్నిసార్లు దుమ్ము, సూక్ష్మ క్రిములు పూర్తిగా పోవు. ఎప్పటికప్పుడు క్లీన్ చేయడమే వీటిని దూరం చేయడానికి ముఖ్య మార్గం.


అదే విధంగా, చాలా మంది పరుపులు వాడతారు. వీటిని ఎలా మెంటెయిన్ చేయాలో తెలియదు. వాటి కోసం వాక్యూమింగ్, బెడ్‌షీట్స్ రెగ్యులర్‌గా క్లీన్ చేయండి. దీని వల్ల అలెర్జీ కారకాలని దూరం చేయొచ్చు. వీటిని మీరు మీకు ఫ్రీగా ఉన్న రోజు చేయొచ్చు. అయితే, చాలా మంది దీనిని ఆదివారం రోజున పెట్టుకుంటారు. దీంతో ఆ రోజు కూడా వర్క్ చేసిన ఫీల్ వస్తుంది. అలా కాకుండా రోజు ఓ పావు గంట వారం పాటు ఒక్కో రోజు ఒక్కో రూమ్ అన్నట్లుగా చేయండి. మీకు అలసట ఉండదు.

దుమ్ము దులిపేందుకు..

ఇంట్లోని దుమ్ము దులిపేందుకు మీరు వాక్యూమ్ క్లీనర్ వాడొచ్చు. లేని వారు పొడి బట్టని తీసి దులపొచ్చు. ఇది క్లీన్ చేసేప్పుడు మీరు మాస్క్ వేసుకోవడం మంచిది. ఆ తర్వాత మైక్రో ఫైబర్ క్లాత్, డస్టర్‌తో ఓ సారి డీప్ క్లీన్ చేస్తే మంచిది.



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..


ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com